సాక్షి నిర్మల్

శుక్రవారం । 26 । మే । 2023



సీఎం సమీక్షలో కలెక్టర్, ఎస్పీ

నిర్మల్‌చైన్‌గేట్: సీఎం కేసీఆర్ నూతన సచివాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, మంత్రులు పాల్గొన్నారు.



ప్రథమ చికిత్సలో 'పైలెట్'

ప్రథమ చికిత్స అందించి ప్రాణాలు కాపాడడంలో 108 పైలెట్లు గుర్తింపు పొందారు. అత్యవసర సమయాల్లో ప్రాథమిక చికిత్స అందిస్తున్నారు.

8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.8/28.7

ఎండ తీవ్రత కొనసాగుతుంది. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. ఉష్ణోగ్రత స్వల్పంగా తగ్గుతుంది. వేడి, ఉక్కపోత కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారి

భైంసా: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆ సంస్థ విజిలెన్స్ అధికారి మైపాల్ ప్రభుదాస్ గురువారం అకస్మికంగా తనిఖీలు చేపట్టారు. బస్టాండ్ ఆవరణలోని పలు దుకాణాల్లో తినుబండారాలు, శీతల పానీయాలు ఎంఆర్‌పీ ధరలకు విక్రయిస్తున్నారా లేదా అనే విషయాలను ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలపై ఎక్స్‌పైరీ తేదీలను పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని ఓ హోటల్‌లో శుభ్రత పాటించకపోవడంతో జరిమానా విధించారు. బస్టాండ్ నిర్వహణ, తదితర వివరాలను కంట్రోలర్ అజ్మీరా శంకర్‌నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ హైదరాబాద్ వారి సహకారంతో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ.లింగన్న తెలిపారు. జిల్లా పెన్షనర్ల సంఘ భవనంలో ఉదయం 10:30 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి పరీక్షలు చేసిన తర్వాత అవసరమైన వారికి ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తారని తెలిపారు.

వడ్ల తరలింపునకు లారీలు ఏర్పాటు చేయాలి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

నిర్మల్‌చైన్‌గేట్: వడ్ల తరలింపునకు లారీలు ఏర్పాటు చేయాలని వెంగ్వాపేట్ రైతులు కలెక్టరేట్ ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంగ్వాపేట్‌లో పండించిన ధాన్యాన్ని మంజులాపూర్ పీఏసీఎస్ ద్వారా కొనుగోలు చేస్తున్నారన్నారు. అయితే లారీలు లేకపోవడంతో వారం రోజులుగా కొనుగోళ్లు నిలిపివేశారని తెలిపారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం అందించారు. వర్షాలు పడితే ధాన్యం తడుస్తుందని తెలిపారు. లారీలు ఏర్పాటు చేసి తూకం వేసిన ధాన్యం వెంటవెంటనే తరలించాలని కోరారు.

ఆకట్టుకున్న ఆదివాసీ కళాజాతర

8లో▸

ఇచ్చోడ మండల కేంద్రంలో గురువారం ఆదివాసీ కళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కళాజాతర పలువురిని ఆకట్టుకుంది.



వాలేగాం గ్రామంలో మక్కలు కొనుగోలు దృశ్యం(ఫైల్)

మార్కెట్ ఫీజు ఎగవేత!

- మార్కెట్‌కు వస్తేనే సెస్ వసూలు..
- కల్లాల వద్దే మక్కలు కొనుగోలు చేస్తున్న దళారులు
- దర్జాగా లారీల్లో తరలింపు
- పట్టించుకోని ఏఎంసీ అధికారులు

భైంసా ఏడీఏ పరిధిలో సాగైన మొక్కజొన్న 33,448 ఎకరాలు
దిగుబడి అంచనా(ఎకరాకు 28క్వి) 9,36,544 క్వింటాళ్లు
ఏప్రిల్, మే(ఇప్పటివరకు) భైంసా ఏఎంసీకి వచ్చిన సెస్ రూ.51.76 లక్షలు

ఆదాయానికి గండి...

ప్రభుత్వం పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మక్కలు కొనుగోలు చేస్తోంది. ఇందుకుగాను పీఏసీఎస్‌లు మార్కెట్ కమిటీకి సెస్ చెల్లిస్తుంది. అలాగే భైంసా మార్కెట్ యార్డులో వ్యాపారులు ఈనామ్‌లో కొనుగోలు చేసినవాటికి సైతం సెస్ రూపంలో ఆదాయం చేకూరుతుంది. కాగా, గ్రామాల్లో రైతుల వద్ద నుంచి నేరుగా కొనుగోలు చేస్తున్న కొందరు వ్యాపారులు మార్కెట్ సెస్ చెల్లించకుండానే మక్కలు తరలిస్తున్నారు. దొరికితేనే.. అన్న చందంగా ఏఎంసీ చెక్‌పోస్టుల వద్ద పట్టుబడిన సందర్భాల్లో మాత్రమే సెస్ వసూలు చేస్తున్నారు. మార్కెట్ యార్డులో సెస్ పరిధిలో కొద్దిశాతం మాత్రమే కొనుగోళ్లు జరుగుతుండగా, చాలావరకు సెస్ చెల్లించకుండా తరలిపోతున్నాయి.

భైంసాటౌన్:రైతులు పండించిన పంట ఉత్పత్తులను విక్రయించే క్రమంలో వ్యాపారులు మోసాలకు పాల్పడకుండా లైసెన్స్ ఉన్న ట్రేడర్స్ మాత్రమే కొనుగోళ్లు జరిపేలా చూడాల్సిన బాధ్యత మార్కెట్ కమిటీలదే. మార్కెట్‌యార్డుకు వచ్చిన పంట ఉత్పత్తులను వ్యాపారులు పరిశీలించి, నాణ్యతను బట్టి ఈ–నామ్‌లో ధర నిర్ణయించి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. తద్వారా రైతుకు సరైన ధరతోపాటు నగదు చెల్లింపులో కచ్చితత్వం ఉంటుంది. దీనికి తోడు రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసిన పంట ఉత్పత్తులపై రూ.వందకు రూ.1 చొప్పున మార్కెట్ కమిటీకి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. తద్వారా రైతులకు న్యాయంతోపాటు మార్కెట్ కమిటీకి ఆదాయం సమకూరుతుంది. కానీ, కొందరు వ్యాపారుల అత్యాశ, అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు మోసపోయే అవకాశంతోపాటు మార్కెట్ కమిటీ ఆదాయం కోల్పోతోంది.

కల్లాల వద్దే కొనుగోళ్లు..

ప్రస్తుతం మక్కల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ఎకరానికి 26 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తోంది. దీంతో మిగిలిన మక్కలను ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దీనికితోడు కొందరు వ్యాపారులు నేరుగా గ్రామాలకు వెళ్లి కల్లాల వద్దే మక్కలు కొంటున్నారు. దీంతో చాలామంది రైతులు వ్యాపారులకే విక్రయిస్తున్నారు. వారంరోజుల్లో డబ్బులు చెల్లిస్తామని హామీ ఇచ్చి మక్కలు కొంటున్నారు. గతంలో కొందరు వ్యాపారులు రైతుల వద్ద మక్కలు కొనుగోలు చేసి నగదు చెల్లించకుండా ఉడాయించిన ఘటనలు ఉన్నాయి. భైంసా, కుంటాల మండలాల పరిధిలో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో గ్రామాల్లో రైతుల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు మోసాలకు పాల్పడే అవకాశం లేకపోలేదు.

తరలిపోతున్న లారీలు..

ఒక్కో లారీకి రూ.3 వేల చొప్పున, రోజుకు పదుల సంఖ్యలో లారీలు మార్కెట్ సెస్ చెల్లించకుండా తరలిస్తున్నాయి. సంబంధిత అధికారుల నిఘా లేకపోవడంతో మార్కెట్ కమిటీ రూ.లక్షల్లో ఆదాయం కోల్పోతోంది. కాగా, గ్రామాల్లో రైతుల నుంచి నేరుగా కొనుగోళ్లతో మార్కెట్ కమిటీ ఆదాయం కోల్పోతోందని భైంసా ఏఎంసీ ఉన్నత శ్రేణి కార్యదర్శి అడెల్లును వివరణ కోరగా, భైంసా ఏఎంసీ పరిధి నుంచి సెస్ చెల్లించకుండా తరలించినా, అన్‌లోడ్ చేసిన చోట సెస్ చెల్లించక తప్పదని చెప్పారు. కాగా, ఎక్కడో సెస్ చెల్లిస్తే భైంసా ఏఎంసీ ఆదాయం కోల్పోతోంది కదా అని ప్రశ్నిస్తే రాష్ట్రంలో ఎక్కడ చెల్లించినా ప్రభుత్వానికే ఆదాయం సమకూరుతుందని పేర్కొనడం గమనార్హం.

జూనియర్ కాలేజీ పిలుస్తోంది

- ఇంటర్ ప్రవేశ ప్రక్రియ షురూ..
- అడ్మిషన్ చేసుకోవాలని అధికారుల సూచన
- జిల్లాలో మొత్తం 4 వేల సీట్లు



నిర్మల్‌లోని బాలుర జూనియర్ కళాశాల భవనం

లక్ష్మణచాంద:ప్రతిభ ఉండి పదో తరగతిలో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులై ఇంటర్‌లో ప్రైవేటు కళాశాలలో చేరేందుకు ఆర్థికంగా వెనుకబడిన మధ్యతరగతికి చెందిన విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు వరంలా మారాయి. ఆర్థికంగా వెనుకబడిన మధ్య తరగతికి చెందిన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. 2023–24 విద్యా సంవత్సరం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైంది. అర్హత, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి పరశురామ్‌నాయక్ తెలిపారు.

జిల్లాలో 38 కళాశాలలు..

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 12, కేజీబీవీ కళాశాలలు 10, మైనార్టీ కళాశాలలు 05, బీసీ గురుకుల కళాశాలలు 03, సోషల్ వెల్ఫేర్ కళాశాలలు 05, ఎస్టీ గురుకుల కళాశాలలు 01, టీఎస్‌ఆర్‌జేసీ 01, ఆదర్శ మోడల్ కళాశాల 01 మొత్తం 38 ఉన్నాయి. ఈ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో మొత్తం 4 వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి.

అడ్మిషన్ పొందడం ఇలా....

1.పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందడానికి అర్హులు.

2. జిల్లాలోని ఏ మండలంలోని విద్యార్థులు ఆ మండలం పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పదో తరగతి హాల్ టికెట్, ఆధార్ కార్డుతో సంప్రదించాలి.

3.విద్యార్థి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి అడ్మిషన్ ఇస్తారు.

అడ్మిషన్లు మొదలు..

జిల్లాలోని వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు ఈనెల 18 నుంచి అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలోని 38 కళాశాలల్లో సంప్రదించి ప్రవేశం పొందవచ్చు.

సకల వసతులు..

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అన్నిరకాల వసతులు ఉన్నాయని అధికారులు తెలిపారు.

- కళాశాలలకు సొంత భవనాలు, విశాలమైన తరగతి గదులు ఉన్నాయి.
- సైన్స్ విద్యార్థులకు అన్నిరకాల ల్యాబ్ సౌకర్యం ఉంది.
- విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందిస్తారు.
- ప్రతీవారం సబ్జెక్టుల వారీగా పరీక్షల నిర్వహణ
- వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు.
- అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యా బోధన.

ప్రభుత్వ కళాశాల ప్రచారం



అడ్మిషన్స్ కోసం ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

కడెం: మా కాలేజీలో చేరండి..ఉచిత విద్య, ల్యాబ్, లైబ్రరీ, స్కాలర్‌షిప్ అందిస్తున్నామని కడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. గురువారం దస్తురాబాద్ మండలం మున్యాల్ గ్రామంలో అడ్మిషన్స్ కోసం పదో తరగతి పాసైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య



జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తాం. అన్ని వసతులతో కూడిన సొంత భవనాలు ఉన్నాయి. మొదటి సంవత్సరంలో చేరేందుకు పదో తరగతి హాల్‌టికెట్, ఆధార్ కార్డుతో ప్రిన్సిపాల్‌ను సంప్రదించి ప్రవేశం పొందాలి.

– పరశురామ్ నాయక్, జిల్లా నోడల్ అధికారి

ప్రతిభను ప్రోత్సహించాలి

- కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజారాం
- 30 మంది విద్యార్థులకు పురస్కారాల ప్రదానం



ప్రశంసాపత్రాలు, మెమొంటోలతో విద్యార్థులు

నిర్మల్ ఖిల్లా:చదువుల్లో ప్రతిభ చూపే విద్యార్థులకు తగిన ప్రోత్సాహం అందించాలని కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు జట్ల రాజారాం అన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 30 మంది కురుమ విద్యార్థులకు జిల్లా కేంద్రంలో గురువారం ప్రతిభ పురస్కారాలు ప్రదానం చేశారు. శాలువా, మెమొంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజారాం మాట్లాడుతూ... కురుమ సామాజికవర్గానికి చెందిన విద్యార్థులు విద్య, ఉద్యోగాల్లో రాణించాలన్నారు. బాలికల విద్యకు సంఘం తరఫున తగిన ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కురుమ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.పోతన్న, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జె.రాజేశ్వర్, రమాదేవి, సంజీవ్, బాలాజీ, సాయినాథ్, దేవన్న, భోజారం, మల్లేశ్, ముత్యం పాల్గొన్నారు.

బోనాలతో వినూత్న నిరసన



బోనాలతో ఊరేగింపులో పాల్గొన్న వీవోఏలు

భైంసాటౌన్:ఐకేపీ వీవోఏలు తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని నిరవధిక సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించాలని వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నారు. ఇందులో భాగంగా గురువారం బోనాలతో వినూత్నంగా నిరసన తెలిపారు. భైంసా ఎంపీడీవో కార్యాలయం వద్ద దీక్షా శిబిరం నుంచి బస్టాండ్ మీదుగా మహాలక్ష్మి మందిర్ వరకు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి, తమ సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వాన్ని మేల్కొల్పాలని కోరుకున్నారు. వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు జయశ్రీ, డివిజన్ పరిధిలోని సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో..

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణంలోనూ పోచమ్మకు బోనాలు తీశారు. డప్పు చప్పుల్ల మధ్య పట్టణంలోని ప్రధాన వీధులగుండా ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల వీవోఏలు ర్యాలీగా ముత్యాల పోచమ్మ ఆలయానికి వెళ్లారు. అనంతరం పూజలు చేసి బోనాలు సమర్పించారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించేలా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మెన సురేశ్, లావణ్య, బదావత్ రవీందర్, స్వప్న, నరేశ్, సుదర్శన్, పల్లవి, శ్రీలత, బుచ్చన్న, రాజు, రవి, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయనికి వెళ్తున్న వీవోఏలు

వీవోఏకు వడదెబ్బ

పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట నెలరోజులకుపైగా సమ్మె చేస్తున్న వీవోఏలు ఎండ వేడికి అస్వస్థతకు గురవుతున్నారు. నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న వీవోఏ భారతమ్మకు వడదెబ్బ తగిలింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను మండలంలోని రాంరెడ్డిపల్లె గ్రామంలోని ఇంటికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు.

వానాకాలం ప్రణాళిక ఖరారు

- 4,10,000 ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం
- వర్షాలు సమృద్ధిగా కురిస్తే పెరగనున్న సాగు విస్తీర్ణం
- 64,236 క్వింటాళ్ల విత్తనాలు, 63 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం
- పత్తిసాగుకే అధికశాతం మొగ్గు



దుక్కి దున్నుతున్న రైతు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో యాసంగి సాగు ముగిసింది... వానాకాలం సాగుకు వ్యవసాయశాఖ సిద్ధమవుతోంది. సాగు ప్రణాళికను జిల్లా వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ అధికారులు రూపొందించారు. వానాకాలంలో రైతులు వేసే పంటల ఆధారంగా కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయశాఖ సిద్ధమవుతోంది. జిల్లాలో సాగయ్యే విస్తీర్ణం ఆధారంగా సమకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యవసాయశాఖ నివేదికలు పంపింది. ఈ వానా కాలంలో వరితోపాటు మిర్చి, పత్తి పంటలు అధికంగా సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనా వేసింది.

పత్తి, వరి అధికం...

జిల్లాలోని 18 మండలాల్లో 4.10 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వానాకాలం పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ప్రధానంగా పత్తి, వరి, సోయా, మొక్కజొన్న, కందులు, మినుము ఎక్కువగా వేస్తారని అధికారులు భావిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేశారు. 63 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచనున్నారు. జిల్లా వ్యాప్తంగా వర్షాధార పంటలు అధికంగా సాగవుతాయి. తేలిక పాటి భూముల్లో 50 మిల్లీమీటర్ల వర్షపాతం నల్లరేగడి నేలల్లో 75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతే విత్తనాలు వేయాలని శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు

రైతుల పొలం బాట..

వర్షాకాలం సమీపిస్తుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పొలాల్లోని పాత పంటల అవశేషాలను తొలగించడం, సేంద్రియ ఎరువులు తరలించడం, మేకలు, పశువుల మందలు వేయడం వంటివి చేస్తున్నారు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు

వానకాలం సీజన్‌లో రైతులు విత్తనాలు, ఎరువులకు ఇబ్బంది లేకుండా వ్యవసాయశాఖ ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటోంది. సీజన్ ప్రారంభం కాగానే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వానాకాలం సీజన్‌కు 64,236 క్వింటాళ్ల వరి, పత్తి, మినుము, కంది, సోయాబీన్, మొక్కజొన్న విత్తనాలు అవసరం కానున్నాయి. అలాగే 63 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కానున్నాయి. ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేలా వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంటుంది.

ఈసారి సబ్సిడీ విత్తనాలు లేనట్లే....

ఈ వానాకాలం సీజన్‌లో కూడా సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేసే అవకాశం లేదు. గతంలో వరితోపాటు వివిధ రకాల విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తుంది. అయితే గత కొంత కాలంగా ఈ సబ్సిడీ విత్తన పంపిణీ చేపట్టడం లేదు. భూసారాన్ని పెంచే జీలుగ, జనుము విత్తనాలను మాత్రమే సబ్సిడీపై అందిస్తోంది.

జిల్లాలో వానాకాలం సాగుకు కావాల్సిన విత్తనాలు

పంట	సాగు విస్తీర్ణం. (ఎకరాలు)	కావాల్సిన విత్తనాలు (క్వింటాళ్లలో)
వరి	లక్ష	15,000
పత్తి	1.50 లక్షలు	13,500
సోయా	90 వేలు	28,000
మొక్కజొన్న	25 వేలు	2,000
కందులు	30 వేలు	1,200
ఇతర పంటలు	15 వేలు	6,000

కావాల్సిన ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో..)

యూరియా	32,000
ఎంఓపీ	7,000
డీఏపీ	7,000
కాంప్లెక్స్	8,000

ప్రణాళిక సిద్ధం చేశాం...

రైతులు వానాకాలం పంటల సాగుకు సిద్ధం అవుతున్నారు. ఈనెల చివరి వారంలో నార్లు పోసుకోవడం, దమ్ము చేసుకునే పనులు ప్రారంభిస్తారు. ప్రభుత్వం నుంచి సరఫరా చేసే విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూసేందుకు ముందుగానే ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తున్నాం.

–అంజి ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

ధాన్యం కొనుగోళ్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

సారంగపూర్: మండలంలోని ఆలూరు, బోరిగాం గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ రాంబాబు, డీఎస్‌వో తనూజతో కలిసి గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా రైతులు తమ సమస్యలు విన్నవించారు. లారీలు రాక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. స్పందించిన అదనపు కలెక్టర్ నిర్మల్ జిల్లా పరిసరాల్లో ఉన్న మిల్లర్లతో మాట్లాడామని, వారు ధాన్యం తీసుకునేందుకు అంగీకరించారని పేర్కొన్నారు. ఒకటిరెండు రోజు ల్లో లారీలు వస్తాయని వెల్లడించారు. ధాన్యం తరలింపు, కొనుగోళ్లు వేగం చేస్తామని చెప్పారు.

నేడు బీజేపీ జిల్లా సమావేశం

నిర్మల్‌చైన్‌గేట్:బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మ రాజు తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జి రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా బాధ్యులు గంగిడి మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ రమాదేవి, పార్లమెంట్ ప్రాభరీ అల్జాపూర్ శ్రీనివాస్, సహ ఇన్‌చార్జి మహేశ్, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య హాజరవుతారని వివరించారు. సమావేశానికి జిల్లా పదాధికారులు, అన్ని మోర్చాల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, జనసంపర్క్ అభియాన్ మండల కమిటీలు హాజరు కావాలని కోరారు.

హజ్ యాత్రీకులకు సహకారం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్

నిర్మల్ టౌన్: ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే హజ్ యాత్రకు వెళ్లే వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాల సహకారం అందిస్తుందని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏపీ ఫంక్షన్ హాల్‌లో హజ్ యాత్రికులకు గురువారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. హజ్ ఎంతో పవిత్రమైందని, ఆర్థిక స్తోమత లేని వారు సైతం యాత్రకు వెళ్లేలా ప్రభుత్వం ఏర్పాట్లు కల్పిస్తుందని తెలిపారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సహకారంతో నిర్మల్‌లో హజ్‌హౌస్ నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హజ్ కమిటీ రాష్ట్ర సభ్యులు ఎండీ.నజీరుద్దీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, ఎండీ.హయాద్, వాహిద్‌ఖాన్, మన్సూర్ హైమద్, డాక్టర్లు నయనారెడ్డి, రాజేంద్రప్రసాద్, వేణుగోపాల్, మతిన్, ఖాదిర్, జమీల్ ఖాన్, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కోచింగ్ క్యాంప్ ప్రారంభం



క్రీడాకారులతో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్

నిర్మల్ టౌన్: సీఎం కప్–2023 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా ఖోఖో క్రీడాకారులకు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో గురువారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ కోచింగ్ క్యాంప్‌ను ప్రారంభించారు. రాష్ట్రస్థాయిలో జిల్లాకు పేరు తీసుకురావాలని సూచించారు. ఈ క్రీడాకారులకు భోజనం, వసతి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అందిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులు ఈ క్యాంపు కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెటా ప్రధాన కార్యదర్శి కె.భోజన్న, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వై.రమణారావు, పీడీ భూమన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

14 మందికి జరిమానా


మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్సై రాజశేఖర్

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 14మందికి జరిమానా విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో గురువారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడగా వారిని నిర్మల్ కోర్టులో హాజరు పరిచారు. 14మందికి రూ.14,800 జరిమానా విధిస్తూ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి అజీజ్ రహమాన్ తీర్పునిచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం కావద్దని ట్రాఫిక్ ఎస్సై పేర్కొన్నారు.

గడ్డివాము దగ్ధం

కుంటాల: మండలంలోని వెంకూర్ గ్రామంలోని ఓ పంట చేనులో గురువారం ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పంటుకుంది. గ్రామానికి చెందిన మోడం గంగాధర్ అనే రైతు తన పంట చేనులో వర్షాకాలంలో పశువులకు అవసరమయ్యే పశుగ్రాసాన్ని నిల్వచేసుకున్నాడు. పంట చేనుపై ఉన్న విద్యుత్ తీగను ఒకదానికొకటి తగలి నిప్పు రవ్వలు ఎగిసి పడడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో రూ.20వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు గంగాధర్ పేర్కొన్నారు.

గోదాం వద్ద అగ్ని ప్రమాదం

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో ఏఎంసీ గోదాం సమీపంలో గడ్డివాముకు గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. గోదాం సమీపంలో స్థానిక రైతులు కొందరు పంటపొలంలో గడ్డికి నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. మంటలు వ్యాపించి గోదాం సమీపంలోని గడ్డివాముకు అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి నష్టం జరగలేదు.

లారీని ఢీకొన్న కంటైనర్


ప్రమాదానికి గురైన వాహనాలు

నేరడిగొండ: మండలంలోని కుప్టి జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఆగివున్న లారీని కంటైనర్ ఢీకొనడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న కంటైనర్ కుప్టి జాతీయ రహదారిపై నిలిపిన లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. జాతీయ రహదారిపై వాహనాలను ఇలా ఆపి ఉంచడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రథమ చికిత్సలో పైలెట్

ప్రమాదం జరిగిన వెంటనే ప్రథమ చికిత్స అందించి ప్రాణాలు కాపాడడంలో 108 వాహనాల పైలెట్లు ప్రథములుగా గుర్తింపు పొందారు. అత్యవసర పరిస్థితులలో క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రులకు చేరవేసి మెరుగైన వైద్య సేవలందిస్తూ పైలెట్లు పలువురి ప్రశంసలు పొందుతున్నారు. రోడ్డు ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలు, పాము కాటుతో పాటు క్షణికావేశంలో పురుగుల మందు తాగిన సమయాల్లో సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలాలకు క్షణాల్లో చేరుకుని క్షతగాత్రుల ప్రాణాలు కాపాడడంలో 108 వాహన పైలెట్లు కీలక భూమిక పోషిస్తున్నారు. నేడు జాతీయ పైలెట్ల దినోత్సవం సందర్భంగా కథనం.

– చెన్నూర్


108 అంబులెన్స్

సీపీఆర్ శిక్షణ పొందుతున్న పైలెట్

- ఆపదలో ఉన్నవారికి అత్యవసర సేవలు
- ఆస్పత్రులకు చేర్చడంలో వీరిదే కీలక పాత్ర
- నేడు జాతీయ పైలెట్ల దినోత్సవం

ఉమ్మడి జిల్లాలో 108 వాహనాలు, పైలెట్ల వివరాలు

జిల్లా	వాహనాలు	పైలెట్లు
ఆదిలాబాద్	18	44
మంచిర్యాల	14	35
కుమురంభీం	12	28
నిర్మల్	08	19

విధుల్లో నిరంతరం అప్రమత్తం

ఎనిమిది గంటల విధుల్లో భాగంగా పైలెట్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ప్రమాద జరిగిన సమాచారం అందిన వెంటనే క్షణాల్లో సంఘటన స్థలానికి చేరుకోవడంతో పాటు క్షతగాత్రులను ఆస్పత్రులకు చేరవేయాల్సిన బాధ్యత పైలెట్లదే. వాహనం అదుపు తప్పనీయకుండా వాహనంలో ఉన్న వ్యక్తి ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా పైలెట్లు కృషి చేస్తున్నారు. ప్రతి వాహనంలో ఒక పైలెట్, ఒక ఈఎంటీ చొప్పున ఇద్దరు విధులు నిర్వహిస్తుంటారు. వాహనానికి వచ్చిన ఫోన్ కాల్ ప్రకారం సంఘటన స్థలానికి చేరుకోవడం వీరి కర్తవ్యం.

పైలెట్లకు సీపీఆర్ శిక్షణ

పైలెట్‌గా చేరిన తర్వాత ప్రథమ చికిత్స అందించడంలో శిక్షణ ఇవ్వడం మామూలే. ఇటీవలి కాలంలో గుండెపోటు మరణాలు ఎక్కువగా వస్తున్నాయి. సీపీఆర్ చేసి బాధితుల ప్రాణాలను కాపాడేందుకు వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి, గర్భిణులకు అంబులెన్స్‌లో సుఖప్రసవం అయ్యే సమయంలో ఈఎంటీలకు ఎలా సహాయపడాలో శిక్షణ పొందారు.

తల్లీబిడ్డలు క్షేమంగా ఉంటే..


గర్భిణులు పురిటినొప్పుల సమయంలో 108లో తీసుకువచ్చే సమయాల్లో ఎక్కువశాతం అంబులెన్స్‌లోనే ప్రసవం అయిన సంఘటనలు న్నాయి. తల్లీబిడ్డ క్షేమంగా ఉంటే సంతోషం కలుగుతుంది.

– ఖలీల్, పైలెట్, కౌటాల, కుమురంభీం

క్షతగాత్రుల ప్రాణాలే ముఖ్యం


పదహారేళ్లుగా పైలెట్‌గా విధులు నిర్వహిస్తున్నా. ప్రమాద సమాచారం వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రులకు చేరవేసి ప్రాణాలు కాపాడడమే మా లక్ష్యం. ఎన్నో రకాల రోగులను అంబులెన్స్‌లో ఆస్పత్రులకు చేరవేశా. అంబులెన్స్‌లో విధులు నిర్వహించం సంతోషంగా ఉంది.

ఎం.శ్రీనివాస్, పైలెట్, చెన్నూర్

అప్రమత్తంగా ఉండాలి


108 వాహనంలో పైలెట్‌గా ఏడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నా. డ్యూటీ సమయంలో చాలా అప్రమత్తంగా ఉండాలి. ఏ సమయంలోనైనా ప్రమాదం జరగొచ్చు. రాత్రి సమయాల్లో మరింత జాగ్రత్తగా ఉంటేనే బాధితులను సకాలంలో సమీప ఆస్పత్రులకు చేరవేయవచ్చు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే అందరి ప్రాణాలకు ముప్పే.– బి.సాయికిరణ్,పైలెట్, జైనథ్

ప్రాణాలతో బయటపడితే...


15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా. కొన్ని రోడ్డు ప్రమాద కేసులు చూస్తే బాధ కలుగుతుంది. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులు ఆర్తనాదాలు చేస్తుంటారు. పురుగుల మందు తాగి ప్రాణాపాయ స్థితిలో ఉంటారు. ఇలాంటి కేసుల్లో ప్రాణాలతో బయటపడితే సంతోషం కలుగుతుంది.

– తిరుపతి, పైలెట్, నిర్మల్

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు


ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

నేరడిగొండ: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గురువారం లారీని ఆర్టీసీ బస్సు ఢీకొనగా పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఈస్ట్ గోదావరి జిల్లా కొత్తపల్లి గ్రామం నుంచి ఫర్టిలైజర్ లోడ్‌తో లారీ ఇచ్చోడ వైపు వెళ్తుంది. నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మండల కేంద్రంలోని సూర్యాగార్డెన్ సమీపంలో లారీని ఢీకొంది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 14 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నేరడిగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా నడిపించడంతో ఈ ప్రమాదం జరిగిందని లారీ డ్రైవర్ ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై కాత్లే రమేష్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవుల పట్టివేత


ఆవులను కుక్కి తరలిస్తున్న వాహనం

గుడిహత్నూర్ : మండల కేంద్రంలోని జాతీయ రహదారి మీదుగా అక్రమంగా తరలిస్తున్న ఆవులను పోలీసులు పట్టుకున్నారు. వారి వివరాల ప్రకారం... పోలీసుల తనిఖీల్లో భాగంగా గురువారం లారీని పట్టుకుని తనిఖీ చేయగా ఆవులను గుర్తించారు. దీంతో లారీలోని డ్రైవర్, క్లీనర్ శేక్ ఇస్మాయిల్, శేక్ హైమద్‌లను అదుపులోకి తీసుకొని విచారించారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా గఢ్‌చాందూర్ నుంచి 13 ఆవులు, 24 ఎడ్లను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. అప్పటికే తీవ్రంగా నీరసించిన పశువులను సమీపంలో కామధేను గోశాలకు అప్పగించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.


వ్యాపారి ఇంట్లో చోరీ

బోథ్: మండల కేంద్రానికి చెందిన రాయిపెల్లి సంతోష్ అనే వ్యాపారి ఇంట్లో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. ఎస్సై రవిందర్ వివరాల ప్రకారం.. సంతోష్ కుటుంబంతో కలిసి బుధవారం సాయంత్రం నిర్మల్‌కు సినిమా చూడడానికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దొంగలు తలుపులు పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాను పగులగొట్టి అందులోని రూ.1,95,000లను అపహరించారు. ఇంటికి వచ్చిన సంతోష్ దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జైపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో చోరీకి యత్నం


భైంసాటౌన్: జైపూర్–హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ రైలులో బుధవారం అర్ధరాత్రి 2గంటల ప్రాంతంలో దొంగ చోరీకి ప్రయత్నించి దొరిగాడు. రైలు బాసర రైల్వేస్టేషన్‌కు చేరుకోగా రైలులో ప్రయాణిస్తున్న మహిళ చేతికి ఉన్న బంగారు గాజును అపహరించేందుకు దొంగ యత్నించగా ఆమె అప్రమత్తమైంది. వెంటనే దొంగ చేతిని పట్టుకోగా దాడి చేసి పారిపోతుండగా తోటి ప్రయాణికులు పట్టుకుని నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులకు అప్పగించారు.

పోగొట్టుకున్న బంగారు గాజులు అప్పగింత


గాజులు అందిస్తున్న హోంగార్డు

భైంసాటౌన్: బాసర అమ్మవారి సన్నిధిలో బంగారు గాజులు పోగొట్టుకున్న ఓ భక్తురాలికి ఆలయ హోంగార్డులకు దొరకడంతో వాటిని ఆమెకు అప్పగించారు. గురువారం హైదరాబాద్‌కు చెందిన భక్తురాలు అమ్మవారి దర్శనానికి రాగా 18గ్రాముల బంగారు గాజులు పోగొట్టుకుంది. దీంతో దేవస్థాన హోంగార్డులకు అవి దొరకడంతో ఆలయ ఈవో సమక్షంలో వాటిని ఆమెకు తిరిగిచ్చారు.

వడదెబ్బతో ఒకరి మృతి


తానాజీ (ఫైల్)

నార్నూర్: మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన సిస్లె తానాజీ (65) వడదెబ్బతో గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... సిస్లె తానాజీకి 15 ఆవులు ఉన్నాయి. ఎండకాలం కావడంతో వాటికి మేత కోసం వదిలిపెట్టాడు. ఐదు రోజులుగా నాలుగు ఆవులు ఇంటికి రాకపోవడంతో వాటి కోసం చుట్టు పక్క గ్రామాల్లో ఎండలో తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి భోజనం చేసి పడుకున్నాడు. కొంతసేపటికి కుటుంబీకులు పరిశీలించగా మృతిచెంది కనిపించాడు. మృతుడికి ఇద్దరు భార్యలు, నాలుగురు కొడుకులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

శిశువు కళ్లలో వెలుగు


చికిత్స అనంతరం బాబుతో వైద్యులు

- 35 రోజుల పసికందుకు అరుదైన చికిత్స
- ప్రసూతి ఆస్పత్రిలో వైద్యం అందించిన ఎల్వీ ప్రసాద్ డాక్టర్లు


జిల్లా ప్రసూతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాబు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ప్రసూతి ఆస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో 35 రోజుల పసికందుకు గురువారం అరుదైన శస్త్ర చికిత్స చేసి కంటి చూపు ప్రసాదించారు. వివరాల్లోకి వెళితే.. సారంగాపూర్ మండలం యాపల్‌గూడకు చెందిన నాగమణి 35 రోజుల క్రితం జిల్లా ప్రసూతి ఆసుపత్రిలో నార్మల్ డెలివరీ అయింది. ఏడో నెలలోనే బాబుకు జన్మనిచ్చింది. కిలో 100 గ్రాములతో బరువుతో ఉన్న శిశువును వెంటిలేటర్‌పై ఉంచి 15 రోజులు చికిత్స అందించారు. పుట్టుకతోనే బాబు కంటి చూపు సరిగా లేదని వైద్యులు సుశ్రుత్, రవినా గుర్తించారు. ప్రత్యేక చొరవ చూపి ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి సమాచారం అందించారు. హైదరాబాద్ నుంచి బాబుకు చికిత్స అందించేందుకు వైద్యులు సుపంత్ వినాయకశర్మ తన బృందం సభ్యులైన సాయికిరణ్, కిషన్ బాబును పరీక్షించారు. గురువారం లేజర్ చికిత్స అందించారు. దీనితోపాటు ఉచితంగా రూ.27 వేల విలువగల ఇంజక్షన్ కూడా అందించారు. ప్రస్తుతం బాబు పరిస్థితి నిలకడగా ఉందని 30 రోజులలోపు ఈ చికిత్స చేయకపోతే బాబు దక్కేవాడు కాదని వైద్యులు తెలిపారు. దీంతో బాబు తల్లిదండ్రులు చికిత్స అందించిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. బాబుకు మెరుగైన వైద్యం అందించినందుకు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దేవేందర్‌రెడ్డి, డాక్టర్ రజిని సదరు వైద్యులను ప్రత్యేకంగా అభినందించారు.

కవి వెంకట్‌కు సన్మానం


మెమెంటో అందుకుంటున్న వెంకట్

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ పద్య కవి బి.వెంకట్‌ను హైదరాబాద్‌లో జరిగిన జాతీయ బాల సాహిత్య సమ్మేళనంలో సన్మానించారు. ఈ నెల 24, 25 తేదీల్లో హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తు డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జాతీయ బాల సాహిత్య సమ్మేళనం నిర్వహించారు. బాల సాహిత్యం, మౌలిక అంశాలు, బాల సాహిత్యం నాడు–నేడు, బాలల కోసం వివిధ నైపుణ్యాలు, బాలల కథారచన మెలకువలు, లలిత కళా పరిచయం ,పాఠశాలల బాల సాహిత్య వికాస కేంద్రాలు, బాల రచయితల ఇష్టాగోష్ఠి తదితర అంశాలపై జరిగిన సదస్సులో వెంకట్ తనదైన శైలిలో అభిప్రాయాలు వెలిబుచ్చారు. అనంతరం పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, సినీగేయ రచయిత వడ్డేపల్లి కృష్ణ, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య నిత్యానందరావు అతడిని సన్మానించారు. ఇందులో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆదివాసీ కళాజాతర

- సంప్రదాయ పాటలు, నృత్యాలతో అలరించిన కళాకారులు
- ప్రత్యేక ఆకర్షణగా పాతతరం కళాకారుల ప్రదర్శన


ఆదివాసీ కళాకారులతో మాజీ ఎంపీ గోడం నగేశ్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఆదివాసీ సకల కళ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కళాజాతర పలువురిని ఆకట్టుకుంది. ఆదివాసీ జాతుల్లో తొమ్మిది తెగలకు చెందిన పాతతరం ఆదివాసీ కళాకారులు కాత్లే లక్ష్మణ్, పెందుర్ మీరబాయి, సోయం లలితాబాయిల కళాప్రదర్శనలు అలరించాయి. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయలకు పుట్టినిల్లని, వాటిని భావితరాలకు అందించే విధంగా కృషి చేస్తున్న ఆదివాసీ సకలకళ సంక్షేమ సంఘం సభ్యులను మాజీ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ అభినందించారు. కనుమరుగవుతున్న కళలను నేటితరం మర్చిపోకుండా ఉండడానికే కళాజాతర ఏర్పాటు చేసినట్లు ఆదివాసీ సకలకళ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కాత్లే శ్రీధర్ తెలిపారు.

అలరించిన కిక్రీ...

నేరడిగొండ మండలంలోని చించోలి గ్రామానికి చెందిన కిక్రీ కళాకారుడు కాత్లే లక్ష్మణ్ బృందం కిక్రీ కళాప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. ఆదివాసీలో ఎంతో ప్రాధాన్యత ఉన్న కిక్రీ ప్రదర్శన కళాకారుడు కాత్లే లక్ష్మణ్ 50ఏళ్లుగా ఈ కళను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శన ఎక్కువగా చనిపోయిన వారి పెద్దకర్మ రోజున వారి ఇంటి ఎదుట రాత్రి వేళల్లో ప్రదర్శిస్తారు.

ఆలోచింపజేసిన ఆదివాసీ రేల పాట...

ఇంద్రవెల్లి మండలంలోని సమాక గ్రామానికి చెందిన పెందుర్ మీరబాయి బృందం పాడిన రేల కళాప్రదర్శన ఆలోచింపజేసింది. సామాజిక రేల పాటల ద్వారా కొన్నేళ్లుగా ఆదివాసీ యువత గ్రామాల్లో ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు ఆమె తెలిపింది. ఆదివాసీ గ్రామాల్లో విద్య అవశ్యత, పేదరిక నిర్మూలన, మూఢనమ్మకాలపై ఆదివాసీలను చైతన్య పరస్తున్నట్లు వివరించారు.

దప్పుదరువు...

బజార్‌హత్నూర్ మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన నాయికపోడ్ కళాకారుడు భీముడు బృందం డప్పు దరువు ఆకట్టుకుంది. సంప్రదాయ పద్ధతిలో డప్పు దరువులో స్త్రీలు, పురుషులు చేసిన దరువు వారి సంప్రదాయ పద్ధతికి అద్దం పట్టింది. జిల్లా వ్యాప్తంగా కళాజాతరలో దాదాపుగా 80మంది కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీల తొమ్మిది తెగలకు చెందిన పెద్దలు కొడప కోసేరావు, అమృత్ రావు, పెద్ది సంతోష్, చాకటి రవి, దుర్వ మోహన్, కాత్లే రాములు పాల్గొన్నారు.


డెంసా నృత్యం చేస్తున్న జాతర్ల కళాకారులు



కిక్రీ కళాప్రదర్శన ఇస్తున్న కాత్లే లక్ష్మణ్ బృందం


దప్పులతో దరువు వేస్తూ..

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో బుధవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రాంగుడ్ల గంగయ్య, రాజేశ్వర్, రవిందర్‌లకు సంబంధించి ఇండ్లు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. రాత్రి సమయంలో ఇళ్లల్లో నిద్రిస్తుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. గమనించిన కుటుంబీకులు ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. కట్టుబట్టలతో బతికి బయటపడ్డామని, ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు వాపోతున్నారు. ఆర్‌ఐ నాగోరావు గురువారం సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. రూ.21లక్షల 74వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.

ఎలక్ట్రికల్ షాపులో షార్ట్ సర్క్యూట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని నేతాజీచౌక్‌లోని శివ ఎలక్ట్రికల్ షాప్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గురువారం సాయంత్రం ఎలక్ట్రికల్ షాపు పై అంతస్తులోని గోదాములో దట్టమైన పొగలు వ్యాపించాయి. గోదాములోని ఎలక్ట్రికల్ సామగ్రి దగ్ధమైంది. ఆ షాపు చుట్టు పక్కల నివాసాలు ఉండడంతో వారు భయాందోళనకు గురయ్యారు. ఫైర్ అధికారులు చేరుకుని మంటలు ఆర్పివేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత చేరుకుని కాలిపోయిన ఎలక్ట్రికల్ వస్తువులను పరిశీలించారు. బాధితుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్ వైర్లు తగిలి.. హార్వెస్టర్ దగ్ధం

ఖానాపూర్: మండలంలోని రాజూరా గ్రామానికి చెందిన శేషరావుకు చెందిన పొలంలో హార్వెస్టర్‌తో గురువారం వరికోతలు చేపట్టారు. ఈ క్రమంలో పొలం పైన ఉన్న త్రీఫేజ్ విద్యుత్ తీగలు హార్వెస్టర్‌కు తగలడంతో మంటలు వ్యాపించాయి. దీంతో క్యాబిన్ పూర్తిగా దగ్ధమైంది. రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లిందని వాహన యజమాని వాపోయాడు.


పంచనామా నిర్వహిస్తున్న ఆర్‌ఐ నాగోరావు